

సమాచార హక్కు చట్టంపై అవగాహన

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లా యువజన సర్వీసుల శాఖ ఆధ్వర్యాన మంగళవారం సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో సమాచార హక్కు చట్టం 2005 వారోత్సవాల సందర్భంగా ఆ చట్టంపై అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యువజన సర్వీసుల శాఖ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కె.ఎస్.ప్రభాకరరావు మాట్లాడుతూ సమాచార హక్కు చట్టం ఏర్పడి 20 సంవత్సరాలు పూర్తయిందని, ఎంతోమంది ఈ చట్టం ద్వారా అనేక ప్రజా ఉపయోగకర సమాచారాన్ని పొంది తమ హక్కులు సాధించుకున్నారని తెలిపారు. విద్యార్థి దశ నుండే సమాచార హక్కు చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, తద్వారా మెరుగైన సమాజం నిర్మాణానికి ప్రతి ఒక్కరూ తమవంతు కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సెట్ వెల్ సిబ్బంది, కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు. ముందుగా కళాశాల విద్యార్థులతో నగరవీధుల్లో ర్యాలీ నిర్వహించారు.

ఇల్లు.. కట్టండయ్యా..!

- కూటమి ప్రభుత్వంలో ఒక్క ఇల్లూ మంజూరు కాని దుస్థితి
- ఇటీవలే దరఖాస్తులు స్వీకరిస్తున్న గృహనిర్మాణశాఖ
- ఏలూరు జిల్లాలో 48,407, పశ్చిమలో 14,230 దరఖాస్తులు
- 14వ తేదీ వరకూ దరఖాస్తుల గడువు పొడిగింపు
- కొత్త ఇళ్లకు అనుమతి ఎప్పటికిస్తారోననే అనుమానాలు
- 2014-19లో ఇళ్ల నిర్మాణ బకాయిలు రూ.80 కోట్లు పెండింగ్‌లోనే



ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి


కొత్త ఇళ్ల నిర్మాణం కోసం జనం గంపెడాశతో ఎదురుచూస్తున్నారు. ఇళ్ల నిర్మాణానికి దరఖాస్తులు వెల్లువెత్తాయి. నవంబర్ 30వ తేదీ వరకూ దరఖాస్తుల స్వీకరణ గడువు విధించడంతో అంతా ఉరుకులు పరుగులు పెట్టారు. చాలామంది దరఖాస్తు చేసుకోకుండానే గడువు ముగిసింది. దీంతో ఈ నెల 14వ తేదీ వరకూ గడువు పొడిగిస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇప్పటి వరకూ కొత్త ఇళ్ల నిర్మాణం గురించి పట్టించుకోలేదు. దీంతో ఎంఎల్ఎల నుంచి సైతం తీవ్ర అసంతృప్తి వ్యక్తమైంది. ఇటీవల ఏలూరులో జరిగిన డిఆర్‌సి సమావేశంలో కొత్త ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని ఎంఎల్ఎలంతా గళమెత్తారు. ఏలూరు జిల్లాలో మొత్తం 48,407 దరఖాస్తులు రాగా, పశ్చిమలో 14,230 దరఖాస్తులు వచ్చాయి. రెండు జిల్లాల్లో ఇప్పటి వరకూ 62,637 మంది కొత్త ఇంటి నిర్మాణానికి రుణం కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇంకా పెద్దఎత్తున దరఖాస్తులు వచ్చే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. దరఖాస్తులు స్వీకరించినా ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం వెంటనే అనుమతిస్తుందా.. లేక తాత్సారం చేస్తుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. గత వైసిపి ప్రభుత్వంలో మంజూరైన ఇళ్ల నిర్మాణమే ప్రస్తుతం సాగుతోంది. ఇంటి నిర్మాణానికి రూ.2.50 లక్షలు చొప్పున ఇస్తున్నారు. కొత్తగా మంజూరు చేసే ఇళ్లకు ఎంత సాయం అందిస్తారో ఇప్పటి వరకూ తెలని పరిస్థితి ఉంది.

కూటమి వచ్చాక కట్టుకున్న ఇళ్లకు సాయం అందిస్తారా?

కూటమి ప్రభుత్వం రావడంతో కొత్త ఇంటి నిర్మాణానికి అవకాశం ఇస్తుందని అంతా ఆశించారు. ఇల్లు కట్టుకునే వారంతా ప్రజాప్రతినిధుల వద్దకు క్యూకట్టారు. దీంతో ఇంటిని నిర్మించుకోండి, ఎప్పుడు ఆన్‌లైన్ చేసినా మీకు ప్రభుత్వ సాయం అందేలా చూస్తామని ఎంఎల్ఎలు హామీ ఇచ్చారు. దీంతో చాలామంది అప్పు చేసి ఇళ్ల నిర్మాణం చేశారు. అటువంటి వారు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకున్నారు. వారికి ప్రభుత్వం సాయం అందిస్తుందా.. లేదా హ్యాండిస్తుందా అనే అనుమానాలు నెలకొన్నాయి. ఇటీవల ఏలూరులో జరిగిన డిఆర్‌సి సమావేశంలోనూ ఇదే అంశంపై చర్చ సాగింది. దీనిపై సిఎంతో మాట్లాడతామని గృహనిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ప్రజాప్రతినిధులు ఇచ్చిన మాటతో ఇల్లు కట్టుకున్న వారికి న్యాయం జరగకపోతే ప్రభుత్వంపై వ్యతిరేకత పెల్లుబికే పరిస్థితి ఉంది.

2014-19లో బకాయిలు ఇచ్చేదెప్పుడు..?

అధికారంలోకి వచ్చిన వెంటనే 2014-19 మధ్య ఇళ్లు నిర్మించుకుని సాయం అందని లబ్దిదారులందరికీ బకాయి సొమ్ము అందిస్తామని ఎన్నికల్లో సిఎం చంద్రబాబు హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చి ఏడాదిన్నర గడిచినా ఇప్పటి వరకూ చిల్లిగవ్వ ఇవ్వలేదు. అప్పట్లో టిడిపి ప్రభుత్వంలో నిర్మాణం జరిగిన ఇళ్లకు తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం బకాయిలు ఇవ్వకుండా ఎగనామం పెట్టింది. వైసిపిపై తీవ్ర వ్యతిరేకత రావడానికి ప్రధాన కారణాల్లో ఇది ఒకటి. అప్పట్లో ఇల్లు కట్టుకుని సొమ్ము అందని లబ్దిదారులు ఏలూరు జిల్లాలో 26,815 మంది ఉండగా రూ.40.96 కోట్లు వరకూ బకాయి ఉంది. పశ్చిమలో 12,395 మంది ఉండగా రూ.40.50 కోట్లు వరకూ పెండింగ్ బకాయిలు ఉన్నాయి. ఈ సొమ్ము ఎప్పటికిస్తారో తెలియని అయోమయ పరిస్థితి నెలకొంది. ఎంఎల్ఎలు జిల్లా సమీక్ష సమావేశాల్లో ప్రశ్నిస్తున్నా ప్రభుత్వం నుంచి మాత్రం సరైన స్పందన లేకుండా పోయింది. ప్రభుత్వం వెంటనే ఇళ్ల నిర్మాణ పాత బకాయిలు అందించాలని అంతా కోరుతున్నారు.



ఇండోర్ స్టేడియం మైదానాన్ని పరిశీలిస్తున్న శాప్ ఛైర్మన్ రవినాయుడు

క్రీడాకారులకు 3 శాతం పోస్టుల కేటాయింపు

శాప్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

క్రీడల్లో ప్రతిభ కనబరిచిన వారికి పరీక్ష లేకుండా మూడు శాతం పోస్టులను కేటాయించనున్నట్లు స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఛైర్మన్ అనిమిని రవి నాయుడు తెలిపారు. మంగళవారం శాప్ డైరెక్టర్లు పి.రవీంద్రనాథ్, కొవ్వాసు జగదీశ్వరితో కలిసి ఏలూరు విచ్చేసిన ఆయన అల్లూరి సీతారామరాజు స్టేడియం, ఇండోర్ స్టేడియం మైదానాలను పరిశీలించారు. ఇండోర్ స్టేడియం మైదానంలో గడ్డి పెరిగిపోయి, ఎక్కడికక్కడ కాగితాలు, పాలిథిన్ కవర్లు, చెత్త ఉండటాన్ని గమనించిన ఆయన ఎందుకు ఇలా ఉందని జిల్లా క్రీడాభివృద్ధి అధికారిని ప్రశ్నించారు. గత నెలలో దీపావళి దుకాణాలు నిర్వహించడం వల్ల ఈ పరిస్థితి ఉందని సమాధానమివ్వగా, ఇక నుంచి క్రీడా మైదానాలు వ్యాపారాలకు ఇవ్వొద్దని, దీనిపై కలెక్టర్, ఎంఎల్ఎలతో తాను మాట్లాడతానని తెలిపారు. వ్యాపారస్తుల నుంచి తీసుకున్న సొమ్మును తిరిగి మైదానం అభివృద్ధికి ఖర్చు చేయాలన్నారు. అసంపూర్తిగా ఉన్న హ్యాండ్‌బాల్ కోర్ట్, స్కేటింగ్ రింగ్, పైకప్పు పూర్తిగా పాడైపోయిన వేదికలను పరిశీలించారు. వాటి మరమ్మతులకు అంచనాలు రూపొందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రవినాయుడు వెయిట్‌లిఫ్టింగ్ హాల్‌లో మీడియాతో మాట్లాడారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం ఇండోర్ స్టేడియం మైదానాలను బాగు చేసి పూర్తిస్థాయిలో క్రీడాకారులకు ఉపయోగపడేలా సిద్ధం చేస్తామని తెలిపారు. మైదానాలలో క్రీడా సౌకర్యాలతోపాటు సుందరీకరణపైనా దృష్టి పెట్టాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారికి సూచించారు. ఎఎస్ఆర్ స్టేడియంలో మూడు లేయర్ల సింథటిక్ ట్రాక్ నిర్మిస్తామని తెలిపారు. ఇటీవల నిర్వహించిన డిఎస్‌సిలో 81 మందికి స్పోర్ట్స్ కోటాలో పిఇటిలు, పీడీలుగా ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. అమరావతి, తిరుపతి, రాజమండ్రి, విశాఖపట్నం, గుంటూరు, కర్నూలు, అనంతపురం ప్రాంతాలను స్పోర్ట్స్ హబ్‌లుగా తయారు చేయనున్నట్లు చెప్పారు. ప్రతి జిల్లాలో స్థానికంగా ఎక్కువ ప్రాచుర్యం పొందిన నాలుగు క్రీడలను ఎంపిక చేసి వాటి అభివృద్ధికి పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో స్పోర్ట్స్ అకాడమీలను పునః ప్రారంభిస్తామని, జనవరి నాటికి రూ.ఐదు కోట్లతో అన్ని జిల్లాలకు క్రీడా పరికరాలు అందిస్తామని తెలిపారు. ప్రతి సంవత్సరం ఆగస్టు నెలలో క్రీడా మాసంగా పాఠశాలల్లో నిర్వహిస్తామన్నారు. అల్లూరి సీతారామరాజు స్టేడియం ప్రాంతంలో ఇప్పటికే 20 ఎకరాలు ఇతర శాఖలకు, కుల సంఘాలకు, రాజకీయ పార్టీలకు అన్యాక్రాంతం కావడంపై మీడియా ప్రశ్నించగా ఇక నుంచి ఒక్క సెంటు భూమి కూడా బయటకు వెళ్లకుండా చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని ఆదేశించినట్లు తెలిపారు. జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఎస్ఎ అజీజ్, పలు క్రీడా అసోసియేషన్ల నాయకులు పాల్గొన్నారు.

రైతులను వీడని దిత్వా దిగులు

కురిసిన వర్షం




రోడ్డుపై బారులు తీరిన ధాన్యం లోడులు

ప్రజాశక్తి - ముదినేపల్లి

దిత్వా తుపాను ప్రభావంతో కురుస్తున్న వర్షంతో మండలంలోని రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో ధాన్యం రాశులు, కాటా వేసిన ధాన్యం బస్తాల వద్ద పగలనక, రేయనక రైతులు కాపలా కాస్తూ వాటి సంరక్షణకు నానావస్థలు పడుతున్నారు. నెల రోజుల క్రితం వచ్చిన మొంథా తుపాను మూలంగా ఏర్పడిన మానుగాయితో రంగుమారి వాసన వచ్చిన ధాన్యాన్ని ఎవరూ కొనక ఇబ్బందులు పడుతున్నామని రైతులు చెబుతున్నారు. అధికారులు సైతం తమగోడు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు.

ఇక మండలంలో మంగళవారం కూడా వర్షం కురిసింది. దీంతో మిషన్ల సాయంతో నూర్చిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. మండలంలో 14,500 ఎకరాల్లో వరి సాగు చేపట్టారు. ఇప్పటి వరకూ సుమారు మూడు వేల ఎకరాల్లో పంటను మిషన్ల సాయంతో నూర్పిళ్లు చేశారు. వందెకరాలు పైబడి కోసిన వరి పైరు పనలపై ఉంది. తేమశాతం తగ్గించేందుకు రైతులు ధాన్యాన్ని రోడ్లపై ఆరబోశారు. రోడ్లపై ఆరబోసిన ధాన్యం వర్షానికి తడవకుండా పరదాలతో కప్పే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. మండలంలో కురుస్తున్న వర్షానికి రైతులు అగచాట్లు పడ్డారు. తమ చేతికొచ్చిన ధాన్యాన్ని గూటికి చేర్చుకునేందుకు రెట్టింపు ఖర్చులు పెడుతున్నారు. గ్రామాల్లో ఎక్కడ చూసినా తమ పంటను కాపాడుకునేందుకు రైతులు పరదాలతో పరుగులు తీస్తున్నారు. రోడ్డు పొడవునా వరి కుప్పలు, ఆరబోసిన ధాన్యపు రాశులు దర్శనమిస్తున్నాయి. కొంతమంది రైతులు యంత్రాలతో మాసూళ్లు చేసిన ధాన్యాన్ని నేరుగా లారీల్లో లోడింగ్ చేసి రైస్‌మిల్లులకు తరలిస్తున్నారు.

కొనసాగిన ఆర్‌టిసి కార్మికుల దీక్షలు



దీక్షలో పాల్గొన్న నేతలు, కార్మికులు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ఆర్‌టిసి నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో జరిగిన అవినీతితో ఎటువంటి సంబంధమూ లేని ముగ్గురు ఉద్యోగస్తుల అక్రమ సస్పెన్షన్లను రద్దు చేయాలని స్థానిక ఆర్‌టిసి డిపో వద్ద ఆర్‌టిసి కార్మిక సంఘాల జెఎసి ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్షలలు మంగళవారం తొమ్మిదో రోజు కొనసాగాయి. మంగళవారం దీక్షలను ప్రారంభించిన ఆర్‌టిసి ఎంప్లాయీస్ యూనియన్ డిపో గౌరవాధ్యక్షులు వై.శ్రీనివాస్ మాట్లాడుతూ అక్రమ సస్పెన్షన్లపై తొమ్మిది రోజులుగా పోరాటాలు చేస్తున్నా యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపి అసలు దోషులను శిక్షించి అక్రమ సస్పెన్షన్లు రద్దు చేయకపోతే రానున్న రోజుల్లో పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. 9వ రోజు దీక్షలో జెయుఎం.రావు, ఓ.చిరంజీవి, పివి.రమణ, వి.సూరన్న, సిహెచ్ఎస్ఎస్.నారాయణ, బిఎస్.చలం, కెపి.రావు, పివివివిఆర్.కుమార్ కూర్చున్నారు.

ధాన్యం మాసూళ్లలో రైతులు నిమగ్నం

సహాయక చర్యల్లో వ్యవసాయ శాఖ

ప్రజాశక్తి - భీమడోలు

తుపాను ఉధృతి తగ్గిన నేపథ్యంలో మండలంలోని రైతులు ధాన్యాన్ని ఒబ్బిడి చేసుకునే ప్రయత్నాలను ముమ్మరం చేశారు. వీరిని ఆదుకునేందుకు వ్యవసాయాధికారులు తమ ప్రయత్నాలను మరింత విస్తృతం చేశారు. ఒక్కో రైతుసేవా కేంద్రంలో 20కి తక్కువ కాకుండా టార్పాలిన్లు సిద్ధం చేశారు. ఎక్కువ మంది రైతులు వీటి సేవలను వినియోగించుకున్నారు. ఈ విషయాలపై భీమడోలు వ్యవసాయాధికారి ఉషారాణిని వివరణ కోరగా, సోమవారం వాతావరణం రైతులను ఆందోళనపర్చిందన్నారు. అయితే కేవలం 1.60 మిల్లీమీటర్ల వర్షపాతం మాత్రమే నమోదు కావడం వారికి ఊరటనిచ్చిందని తెలిపారు. మండలంలో ఇంకనూ రెండు వేల ఎకరాల్లో కోతలు జరగాల్సి ఉందన్నారు. తుపాన్ నేపథ్యంలో 2,600 మెట్రిక్ టన్నుల ధాన్యం ఆరబెట్టిన దశలో ఉండగా, 1,500 మెట్రిక్ టన్నుల ధాన్యం బస్తాల్లో భద్రపర్చారన్నారు. రైతులకు 244 బరకాలను పంపిణీ కోసం సిద్ధం చేశామన్నారు. తుపాన్ ప్రభావం ఇంకా తగ్గని నేపథ్యంలో లోతట్టు ప్రాంతంలో కోతలు పూర్తయిన వరి పంటను ముందు జాగ్రత్త చర్యగా సురక్షిత ప్రదేశాలకు చేర్చి భద్రతా చర్యలు చేపట్టాలని కోరారు.



భీమడోలు మండలంలో రోడ్డుపైనే ధాన్యం ఆరబోత

మహిళలు, వ్యవసాయ కార్మికుల సమస్యలపై పోరాడిన అన్నే

ప్రజాసంఘాల నాయకులు



ఏలూరు అర్బన్ : నినదిస్తున్న నేతలు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

మహిళలు, వ్యవసాయ కార్మికుల కోసం నిరంతరం కృషిచేసిన నాయకురాలు అన్నే అనసూయ అని వివిధ ప్రజాసంఘాల నాయకులు కొనియాడారు. మంగళవారం అన్నే వెంకటేశ్వరరావు భవనంలో ఐద్వా జిల్లా కార్యదర్శి ఎ.శ్యామల రాణి అధ్యక్షతన అన్నే అనసూయ 8వ వర్ధంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఎ.రవి, ఎవిఆర్ విజ్ఞాన కేంద్రం జిల్లా కార్యదర్శి జివిఎల్.నరసింహారావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ నూతన సమాజం కోసం అహర్నిశలు కృషిచేసిన వారిలో అన్నే అనసూయ, వెంకటేశ్వరరావులు ఉన్నారన్నారు. ఈ జిల్లాలో వ్యవసాయ కార్మిక, మహిళలు, రైతుల సమస్యలపై పనిచేశారని తెలిపారు. పేదల పక్షాన ఎర్రజెండా ఎత్తి నికరంగా పోరాటం చేయడంలో అన్నే దంపతులు ఆదర్శనీయమన్నారు. వ్యవసాయ కార్మికుల కూలీ రేట్లు, పేదల భూముల కోసం కొల్లేరు ప్రాంతం పేదల కోసం, మహిళల సమస్యలు, పేదల బడుగు బలహీన తరగతుల కోసం నిరంతరం పనిచేశారని కొనియాడారు. తుది శ్వాస వరకు ఎత్తిన ఎర్రజెండా దించకుండా పేదల పక్షాన పోరాటం చేయడంలో అన్నే దంపతులు ఆదర్శనీయమన్నారు. పేదల పక్షాన ప్రభుత్వాలు నిలదీయడంతో పాటు, పేదల పక్షాన ఉద్యమాలు, పోరాటాలు నిర్వహించడంతో క్రియాశీల పాత్ర పోషించారన్నారు. వ్యవసాయ కార్మిక ఉద్యమం, మహిళా ఉద్యమం కోసం అన్నే అనసూయ చేసిన కృషి మరువలేనిదన్నారు. పాలకులు అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు, పోరాటాలు చేయడమే అన్నే దంపతులకు ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. అనంతరం అన్నే అనసూయ ముని మనవరాలు రచన మాట్లాడుతూ సామ్రాజ్యవాద దేశాలలో కమ్యూనిజం చచ్చిపోయిందని అంటున్న నేపథ్యంలో అమెరికా లాంటి అతి పెద్ద సామ్రాజ్యవాద దేశంలో నేడు ఎర్రజెండా రెపరెపలాడిందన్నారు. ఈ సభలో మహిళా సంఘం జిల్లా అధ్యక్షులు హైమావతి, సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి, చేతివృత్తుల కన్వీనర్ పి.ఆదిశేషు, నాయకులు ఇస్సాకు, అరుణకుమారి, అన్నే అనసూయ కుటుంబ సభ్యులు కల్పన, రచన పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : అన్నే అనసూయమ్మ ఆశయసాధనకు పాటు పడాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సత్తు కోటేశ్వరరావు అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మాజీ కార్యదర్శి అన్నే అనసూయమ్మ 8వ వర్ధంతి సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం, భూ పోరాట కమిటీ ఆధ్వర్యాన మంగళవారం చిన్నాగిరిపల్లిలో అనసూయమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి జోహార్లు అర్పించారు. ఈ కార్యక్రమంలో భూ పోరాట కమిటీ నాయకులు అర్జునరావు, అనిల్, కవిత, మోహనరావు, సుబ్బారావు పాల్గొన్నారు.

ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించొద్దు

ఆయిల్‌ఫెడ్ కర్మాగారం కొత్తది నిర్మించాలి

ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్

ప్రజాశక్తి - పెదవేగి

పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని ప్రయివేటీకరించొద్దని, నూతన ఆయిల్‌ఫెడ్ కర్మాగారం నిర్మించాలని, దీనికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిధులు కేటాయించాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం పెదవేగిలో సంఘం నేతలు ఆయిల్ తోటలను పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్రంలో రోజురోజుకీ ఆయిల్‌పామ్ విస్తీర్ణం పెరుగుతుందన్నారు. దేశంలోనే అత్యధికంగా ఏలూరు జిల్లాలో ఆయిల్‌పామ్ సాగు ఉందన్నారు. సహకార రంగంలో ఉన్న ఆయిల్‌ఫెడ్ కర్మాగారాన్ని అభివృద్ధి చేయకుండా ప్రయివేటీకరించాలనే ప్రభుత్వ యోచన తగదన్నారు. ఒకవైపు ప్రయివేట్ ఫ్యాక్టరీలు లాభాలు గడించి మరిన్ని యూనిట్లు ఏర్పాటు చేస్తుంటే, పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారం అభివృద్ధికి నోచుకోకపోవడం బాధాకరమన్నారు. పాత మిషనరీతో ఉన్న ఆయిల్‌ఫెడ్ కర్మాగారం స్థానంలో కొత్త కర్మాగారం నిర్మించకుండా, ఉన్న ఫ్యాక్టరీని ప్రయివేటీకరించే చర్యలు ఆయిల్‌పామ్ రైతులకు అన్యాయం చేయడమేనని ఆందోళన వ్యక్తం చేశారు. నూతన ఆయిల్‌ఫెడ్ కర్మాగారం నిర్మాణానికి ప్రభుత్వాలు నిధులు కేటాయించకుండా నిర్లక్ష్యం చేయడం అన్యాయమన్నారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో వస్తున్న రికవరీ శాతం ఆధారంగానే ధర నిర్ణయం జరుగుతుందన్నారు. తెలంగాణా రికవరీ శాతంపై ఆధారపడి ధర నిర్ణయిస్తున్నారన్నారు. గతంలో ఆంధ్ర ప్రాంత ఆయిల్‌పామ్ గెలలు తెలంగాణలోని అశ్వారావుపేటలోని ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో మిల్లింగ్ చేస్తే తెలంగాణ కంటే ఆంధ్ర గెలలకు ఎక్కువ రికవరీ శాతం వచ్చిందని గుర్తు చేశారు. ఆయిల్ రికవరీ శాతం ఈ సంవత్సరం కూడా అశ్వారావుపేటలోని తెలంగాణ ఆయిల్‌ఫెడ్ కర్మాగారంలో మన గెలలు మిల్లింగ్ చేసుకోవాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైనా పెదవేగిలోని పాత ఆయిల్‌ఫెడ్ కర్మాగారం స్థానంలో నూతన కర్మాగారం నిర్మించేందుకు నిధులు కేటాయించి అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. సహకార రంగంలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీలు నిర్మించాలన్నారు. పెదవేగి ఆయిల్‌ఫెడ్ కర్మాగార ప్రయివేటీకరణ చర్యలపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. కార్యక్రమంలో గోళ్ల అర్జునరావు, మెతుకుమెల్లి రాంబాబు, కూచిపూడి రామ్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



పరిశీలిస్తున్న నేతలు, రైతులు

ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా : మేయర్

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

నగర అభివృద్ధికి ప్రజాసమస్యల పరిష్కారమే ఎజెండా అని, మంచి పరిపాలనకు నిదర్శనమని ఏలూరు నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో మంగళవారం మేయర్ నూర్జహాన్ అధ్యక్షతన కౌన్సిల్ సర్వసభ్య సాధారణ సమావేశం నిర్వహించారు. నగర అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారానికి ఇటువంటి చక్కటి సాంప్రదాయ పద్ధతిలో కౌన్సిల్ సమావేశం జరగడం సంతోషదాయకమని, అభివృద్ధికి సూచిక అని నగరపాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు అన్నారు. 18 అంశాలతో రూపొందించిన ఎజెండా మున్సిపల్ కార్మికుల జీవితాలకు భద్రత కల్పించే అంశాలు ఉన్నాయన్నారు. ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ లోని 27వ డివిజన్ కొంత ప్రాంతం దెందులూరు అసెంబ్లీ నియోజకవర్గంలో కలిసి ఉండడంతో సచివాలయ సేవలు వారికి ఇబ్బందికరంగా మారడంతో వారిని కార్పొరేషన్ నుంచి తొలగించి ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసుకొనుటకు కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. షెడ్యూల్ కులాల నివాసిత ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు కల్పించుటకు కోటి రూపాయల నిధులు కేటాయించడం జరిగిందన్నారు. నిబంధనలకు లోబడి స్టాండింగ్ కౌన్సిల్ సభ్యుడిని ఎన్నుకోవడం జరిగిందన్నారు. నిబంధనల ప్రకారం ట్రేడ్ లైసెన్స్ రుసుము ప్రస్తుత రేట్లపై 33 శాతం పెంచడానికి కౌన్సిల్ ఆమోదం తెలిపిందన్నారు. నగరపాలక సంస్థలో ఏడు పంచాయతీలు కలవక ముందే ఏర్పడ్డ కరెంటు బిల్లు బకాయిలు, అపరాధ రుసుము కలిపి 34 కోట్ల రూపాయలకు చేరిందని, బిల్లుల బకాయిలు చెల్లించడానికి ప్రత్యేక నిధులు మంజూరు చేయవలసిందిగా ప్రభుత్వాన్ని కోరుటకు సమావేశం తీర్మానించిందని మేయర్ తెలిపారు. కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సహకారంతో ఏలూరు ఎంఎల్ఎ బడేటి రాధాకృష్ణయ్య, నగర పాలక సంస్థ మేయర్ షేక్ నూర్జహాన్ పెదబాబు, నగర పాలక సంస్థ పాలకవర్గం, కమిషనర్ ఎ.భాను ప్రతాప్ అందరం కలిసికట్టుగా చేసిన కృషి ఫలితంగా కార్పొరేషన్‌కు వచ్చిన రూ.453 కోట్ల నిధులతో నగరాన్ని సుందరీకరిస్తూ ప్రజలకు అన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ జనరల్ ఫండ్స్, ఇతర గ్రాంట్లు రూ.49 కోట్లతో ఎంఎల్ఎ ఆదేశాలతో రోడ్లు, డ్రెయినేజీలు, కల్వర్టులు, ఫౌంటెన్లు నిర్మించడం జరిగిందన్నారు. రూ.వందల కోట్ల నిధులు ఉపయోగించి ఏలూరు నగరం దిశ దశ మార్చబోతున్నామని ఎస్ఎంఆర్.పెదబాబు తెలిపారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు కో-ఆప్షన్ సభ్యులతో పాటు మున్సిపల్ కమిషనర్ ఎ.భాను ప్రతాప్, అదనపు కమిషనర్ డి..శ్రీనివాస్, మున్సిపల్ ఇంజినీర్ ఇ.సురేంద్రబాబు, మేనేజర్ మూర్తి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మేయర్

రైతులను వెంటాడుతున్న టార్గెట్..!

ప్రజాశక్తి - చింతలపూడి

మండలంలో ఉన్నటువంటి రైస్ మిల్లుల టార్గెట్ అయిపోయిందని, రైతులు ధాన్యం తోలుకునే అవకాశం లేకపోవటంతో వాతావరణం మార్పులు రావటంతో దగ్గర్లో ఉన్న మిల్లుకి ధాన్యం వేసుకొనే అవకాశం లేకపోవటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలో ఉన్న రైతులు దగ్గరలో ఉన్న రైస్ మిల్‌కి ధాన్యం తోలుకుందామంటే టార్గెట్(బ్యాంక్ గ్యారంటీ) లేక, ట్రక్ షీట్లు రాక ధాన్యం తోలుకోలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు. వాతావరణ ప్రభావంతో వర్షం జల్లులు పడటంతో, జల్లుల కాస్త వర్షంగా మారుతుందనే భయంతో రైతులు సతమతం అవుతున్న పరిస్థితి నెలకొంది. చింతలపూడిలో ఉన్నటువంటి రైస్ మిల్లులకు టార్గెట్ పెంచితే రైతులు ధాన్యం తోలుకునే అవకాశం వస్తుందని అభిప్రాయ పడుతున్నారు. దగ్గరలో ఉన్నటువంటి రైస్ మిల్లులకు కాకుండా ఏలూరులో ఉన్న రైస్ మిల్లులకు ట్రక్ సీట్లు వస్తున్నాయి కానీ లారీలు లేక, ఒకపక్క సంచులు లేక రైతులు ధాన్యం ఏం చేయాలో తెలియక సతమతమవుతున్న పరిస్థితి నెలకొంది. జిల్లా అధికారులు స్పందించి చింతలపూడిలో ఉన్నటువంటి రైస్ మిల్లులకు టార్గెట్ పెంచితే, వాతావరణంలో మార్పులకు దగ్గర్లో ఉన్నటువంటి రైస్ మిల్లులకు ధాన్యం తోలుకునే అవకాశం కల్పించాలని రైతులు కోరుకుంటున్నారు.

వాహనదారులు ఫిట్నెస్ చేయించుకోవాలి

రవాణా శాఖ అధికారి కెఎస్ఎంవి.కృష్ణారావు

ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఉన్న అన్ని రవాణా వాహనాల యజమానులు తమ వాహనం ఫిట్నెస్‌కు తమకు దగ్గరలో ఉన్న ఆంధ్రప్రదేశ్ మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్(మోర్త్) వారి ఎటిఎస్ అనగా ఆటోమేటెడ్ టెస్టింగ్ స్టేషన్ సెంటర్స్‌లో టెస్టింగ్ చేయించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా రవాణా శాఖ అధికారి కెఎస్ఎంవి.కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. మచిలీపట్నం, రాజమండ్రి, అమలాపురం లేదా మీకు దగ్గరలో ఉన్న ఎటిఎస్ సెంటర్‌లలో వాహనమును ఫిట్నెస్ చేయించుకోవలసిందిగా పేర్కొన్నారు. రవాణా వాహనాల యజమానులు https://vahan.parivahan.gov.in/AFMS వాహన సర్వీస్‌లో ఆధార్‌తో రిజిస్ట్రేషన్ చేయించుకుని ప్రభుత్వం నిర్ణయించిన ఫీజుని జమచేసి స్లాట్ పొంది ఫిట్నెస్(ఎటిఎస్) సెంటర్స్‌లో వాహనాలకు ఫిట్నెస్ పరీక్ష చేయించవలసిందిగా ఆయన తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ మినిస్ట్రీ ఆఫ్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ అండ్ హైవేస్(మోర్త్) వారి నిర్ణయం ప్రకారంగా ఫిట్నెస్ వెరిఫికేషన్ రవాణా శాఖ వారు నిర్వహించడం, నిలిపివేయడం జరిగిందని కృష్ణారావు తెలియజేశారు.

చింతలపూడి అభివృద్ధికి కృషిచేయాలని వినతి

చింతలపూడి: ఉంగుటూరులో సోమవారం జరిగిన ముఖ్యమంత్రి పర్యటనలో చింతలపూడి నియోజకవర్గానికి చేపట్టవలసిన పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విజ్ఞాపన ఎంఎల్ఎ ముఖ్యమంత్రికి అందజేశారు. ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ చేసిన విజ్ఞప్తిపై స్పందించిన ముఖ్యమంత్రి ముఖ్యమైన అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కృషిచేస్తామని సానుకూలత వ్యక్తం చేశారని తెలిపారు. ఈ సందర్భంగా చింతలపూడి లిఫ్ట్ ఇరిగేషన్‌కు అతి త్వరలో మోక్షం కలగనుందని, ఏలూరు-జంగారెడ్డిగూడెం రోడ్డు ఫోర్ లైన్‌గా మార్చడానికి కేంద్రానికి ప్రతిపాదనలు పంపించామని తెలియజేస్తూ చింతలపూడి నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలియజేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేశారు.

కిడ్నీ వ్యాధి బాధితుడికి సాయం

జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం పట్టణంలోని ఉప్పలమెట్ట 19వ వార్డుకు చెందిన చలమచర్ల బాబి కొద్దికాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతూ, డయాలసిస్ చికిత్స కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాడు. ఈ విషయం స్థానిక నాయకులు, టిడిపి పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్ దృష్టికి తీసుకురాగా ఆయన వెంటనే ఎంఎల్ఎ రోషన్ కుమార్‌కు వివరించారు. విషయం తెలుసుకున్న ఎంఎల్ఎ అధికారులతో వెంటనే మాట్లాడి, అవసరమైన పత్రాలు సేకరించడంతో పాటు అత్యవసరంగా పెన్షన్ మంజూరు చేయాలని ఆదేశించారు. కేవలం నెలరోజుల వ్యవధిలోనే రూ.20 వేల పెన్షన్ మంజూరు చేశారు. వారికి బాబి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నంబూరి రామచంద్రరాజు, కంపా రాజేంద్ర, వెంపల రాజు, కోనేటి చంటి, షేక్ రషీద్, శీలం రాంబాబు పాల్గొన్నారు.

ద్వారకాతిరుమలలో వర్షం, తీవ్ర చలి

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమలలో సాయంత్రం నాలుగు గంటల సమయంలో ఆకాశం మేఘావృతమై కొద్దిపాటి జల్లులు పడ్డాయి. చలి తీవ్రత విపరీతంగా ఉండటం వల్ల ప్రజలు ఇబ్బంది పడ్డారు. పంటలు చేతికొచ్చిన చుట్టుపక్కల గ్రామాల్లో రైతాంగం పంట దక్కుతుందో, లేదో అని ఆందోళన చెందుతున్నారు. మండలంలోని చాలా గ్రామాల్లో వరి పంటను కూడా రైతులు సాగు చేస్తున్నారు.

అన్-ఎంప్లాయిమెంట్ బెనిఫిట్స్ ఇప్పించాలని వినతి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు, కొత్తూరు జూట్ మిల్లులు అర్ధాంతరంగా మూసివేసిన కారణంగా ఇఎస్ఐ ద్వారా కార్మికులకు రావలసిన అన్-ఎంప్లాయిమెంట్ బెనిఫిట్స్‌ని ఇప్పించే విధంగా చూడాలని కోరుతూ ఐఎఫ్‌టియు ప్రతినిధి బృందం మంగళవారం ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్‌కుమార్ యాదవ్‌ని వారి కార్యాలయాల్లో కలిసి వినతి పత్రం సమర్పించారు. ఎంపీ సానుకూలంగా స్పందించారు.

నేరాలు - ఘోరాలు

తాడువాయిలో విషాదఛాయలు

వేటకు వెళ్లి మత్స్యకారుడి మృతి

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మండలంలోని తాడువాయి గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. స్థానికంగా చేపలు పట్టే వృత్తితో జీవనం సాగిస్తున్న నబిగిరి వెంకటేశ్వరరావు(60) మంగళవారం ఉదయం చేపల వేట కోసం పడవ వేసుకుని ఎర్రకాలువ వద్దకు వెళ్లారు. చేపలు వేట పడుతుండగా వల ఆయన శరీరానికి చిక్కుకోవడంతో సమతుల్యం కోల్పోయి ప్రమాదంశాత్తూ కాలువలో పడిపోయారు. బయటపడే లోపే ఆయన మృతిచెందినట్లు గ్రామస్తులు తెలిపారు. తోటి మత్స్యకారులు మృతిచెందిన వెంకటేశ్వరరావు మృతదేహాన్ని కాలవలో నుంచి బయటికి తీసినట్లు తెలిపారు. అనంతరం మృతదేహాన్ని జంగారెడ్డిగూడెం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి, పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపారు. మృతుడు వెంకటేశ్వరరావుకి భార్య గంగారత్నం, ముగ్గురు సంతానం, ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు. ముగ్గురికి వివాహాలు జరిపించారు. కుమారుడు సురేంద్ర కూడా చేపలు పట్టి జీవనం సాగిస్తున్నాడు. ఈ దుర్ఘటనతో వారి కుటుంబంలో విషాదం అలముకుంది. కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు.

పాత కక్షల నేపథ్యంలో వ్యక్తి హత్య

ప్రజాశక్తి - భీమడోలు

పూళ్ల గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో ఒక వ్యక్తి మంగళవారం హత్యకు గురయ్యారు. భీమడోలు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పూళ్ల గ్రామానికి చెందిన పాత దళితవాడ నివాసి పాతల నాగరాజు(40)కు అదే ప్రాంతానికి చెందిన కాండ్రు నాగతేజ అనే వ్యక్తితో వివాదాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో హత్యకు గురైన నాగరాజుపై ప్రధాన నిందితుడిగా గుర్తించిన నాగ తేజతో పాటు అతని సన్నిహితులు మూకుమ్మడిగా కత్తులతో దాడి చేశారు. తీవ్ర గాయాలపాలైన నాగరాజు ఘటన స్థలిలోనే చనిపోయారు. సమాచారం అందుకున్న భీమడోలు సిఐ యుజె.విల్సన్, ఎస్ఐ మదీనా భాషా సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. క్లూస్ టీంతోపాటు, డాగ్ స్క్వాడ్ సహకారం తీసుకున్నారు. నిందితులను అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు

ప్రజాశక్తి - టి.నరసాపురం

వివాహిత అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ ఎం.జయబాబు మంగళవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన గంగిరెడ్ల అప్పలరాజు గత 8 సంవత్సరాల నుండి టి.నరసాపురం మండలం బొర్రంపాలెం గ్రామంలో భార్య, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసం వుంటున్నారు. ఈక్రమంలో అప్పలరాజు ఇటీవల భవానీమాల వేసుకొని నవంబర్ 27న రాత్రి 7 గంటలకు అదే వీధిలో వున్న పీఠం వద్దకు వెళ్లగా భార్య హిమజ, ఇద్దరు పిల్లలు ఇంటి వద్దనే వున్నారు. ఈ నేపథ్యంలో అప్పలరాజు పీఠం వద్ద పూజ ముగించుకుని రాత్రి 10 గంటలకు ఇంటికి వచ్చి చూడగా భార్య, పిల్లలు కనిపించలేదని, చుట్టుపక్కల పరిసర ప్రాంతాల బంధువుల ఇళ్ల వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. దీంతో అదే గ్రామానికి చెందిన శానంపూడి కుమార్ అనే వ్యక్తిపై అనుమానం వున్నట్లు హిమజ భర్త అప్పలరాజు ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి - ఉంగుటూరు

జాతీయ రహదారి చేబ్రోలు వద్ద నడిచి వెళ్తున్న రావాడ రామాయమ్మ(60) అనే మహిళను గుర్తుతెలియని వాహనం మంగళవారం తెల్లవారుజామున ఢీ కొట్టి వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆ మహిళ అక్కడికక్కడే దుర్మరణం చెందింది. ఆమెకు మతిస్థిమితం లేదని రోడ్లపై వెళ్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. హైవే పోలీసులు సంఘటన వద్దకు చేరుకొని మృతదేహాన్ని తాడేపల్లిగూడెం ప్రభుత్వాసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు.

బైకును ఢీకొన్న ఆర్‌టిసి బస్సు

ప్రజాశక్తి - ముదినేపల్లి

బైకును ఆర్‌టిసి అద్దె బస్సు ఢీ కొట్టిన సంఘటన మంగళవారం సాయంత్రం ముదినేపల్లిలో జరిగింది. సేకరించిన వివరాల ప్రకారం గుడివాడ డిపోకు చెందిన ఆర్‌టిసి అద్దె బస్సు గుడివాడ నుంచి ప్రయాణికులతో బంటుమిల్లి వెళుతుంది. ఈ క్రమంలో ముదినేపల్లి తహశీల్దార్ కార్యాలయ సమీపంలో ఎదురుగా వస్తున్న బైక్‌ను బస్సు ఢీకొంది. ఈ ఘటనలో బైక్‌పై ఉన్న వ్యక్తికి గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు బస్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.

ప్రతి ధాన్యం గింజా కొనుగోలు చేస్తాం

మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి



ప్రజాశక్తి - ముసునూరు

రాష్ట్ర ప్రభుత్వం రైతు పండించిన ప్రతి ధాన్యం గింజనూ కొనుగోలు చేయడం జరుగుతుందని మండల వ్యవసాయాధికారి ఎ.చాముండేశ్వరి అన్నారు. ఆమె ప్రజాశక్తితో మాట్లాడుతూ వ్యవసాయ రంగంలోని పలు అంశాలపై ముచ్చటించారు.

చిట్ - చాట్

ప్రశ్న : మండలంలో ఎన్ని ఎకరాల్లో వరి పండిస్తున్నారు? ఏ రకం ఎంతెంత విస్తీర్ణంలో సాగు చేశారు?

ఎఒ : మండలంలోని 16 గ్రామాల్లో, వాటి శివారు గ్రామాలతో కలుపుకుని 6,300 ఎకరాల్లో వరి పంట సాగు చేశారు. 12 24 రకం 1980 ఎకరాల్లో సాగు చేయగా, 13 18 రకం 14 60 ఎకరాల్లో సాగు చేశారు. 12 62 రకం 860 ఎకరాల్లో, 10 75 రకం 1500 ఎకరాల్లో, 10 61 రకం 600 ఎకరాల్లో సాగుచేశారు.

ప్రశ్న : ప్రభుత్వం ధాన్యం సేకరణ ఎన్ని రైతు సేవా కేంద్రాల్లో ఏర్పాటు చేసింది? రైతులకు సరిపడా ఎన్ని గోనెసంచులు అందుబాటులో ఉంచారు?

ఎఒ : మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో 11 వ్యవసాయ పరపతి సంఘం సొసైటీల ద్వారా, వాటి అనుబంధంగా ఉన్న రైతు సేవా కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుంది. గోనె సంచులు సుమారుగా రెండు లక్షలు అవసరం ఉండగా, ప్రస్తుతం లక్ష 15 వేల గోనె సంచులు ఆయా ఆర్ఎస్‌కె కేంద్రాల్లో, ఏజెన్సీ కేంద్రాల్లో ఉన్నాయి.

ప్రశ్న : ధాన్యం ఎ గ్రేడ్ రకం, కామన్ గ్రేడ్ రకం ఎంత రేట్లకు నిర్ణయించారు?

ఎఒ : ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ఎ గ్రేడ్ రూ.2,389, కామన్ గ్రేడ్ మద్దతు ధర రూ.2,369 నిర్ణయించారు.

ప్రశ్న : ధాన్యం కొనుగోలు చేసేందుకు సిబ్బంది, యంత్ర పరికరాలు ఎలా ఏర్పాటు చేశారు?

ఎఒ : ఆయా వ్యవసాయ పరపతి సంఘం సొసైటీ సిబ్బందితోపాటు, ఏజెన్సీ సిబ్బంది ప్రత్యేక కొనుగోలు సిబ్బందిని ఏర్పాటు చేశారు. 11 సొసైటీల ద్వారా ప్రస్తుతం కొనుగోలు చేయటం జరుగుతుంది.

ప్రశ్న : కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత రైతులకు సబ్సిడీపై ఎలాంటి యంత్ర పరికరాలు అందుబాటులోకి వచ్చాయి?

ఎఒ : యాంత్రికరణ వ్యవసాయ పరికరాల అనుబంధంతో అధిక దిగుబడిని పొందాలనే ఉద్దేశంతో రూ.9.80 లక్షలతో డ్రోన్ వ్యవసాయ పరికరాన్ని అందుబాటులో తీసుకువచ్చింది. రసాయనిక, క్రిమిసంహారక, ప్రకృతి సేద్యం లాంటి మందులు పిచికారీ చేసేందుకు ఈ యంత్రం ఉపయోగపడుతుంది. రైతులు రూ.2 లక్షలు మాత్రమే నగదు జమ చేయాలి, మిగతాది ప్రభుత్వమే సబ్సిడీ ఇస్తుంది.

ప్రశ్న : రైతులకు ఎన్ని టార్పిన్ పట్టాలు అందుబాటులో ఉంచారు? తేమ శాతం లేకుండా ఉండాలంటే ఎంత శాతం ఉండాలి?

ఎఒ : మండలంలోని 16 గ్రామ పంచాయతీల్లో, 13 రైతు సేవా కేంద్రాల్లో టార్పిన్ పట్టాలు అందుబాటులో ఉంచాం. అలాగే ధాన్యంలో తేమశాతం 17 శాతం కన్నా తక్కువ ఉండరాదని అవగాహన కల్పిస్తున్నాం.

ప్రశ్న : ప్రస్తుతం రబీ సీజన్ కాలంలో సీడ్ మొక్కజొన్న పంటల యాజమాన్యం, ఆర్గనైజర్ల నుండి బాండ్‌లు తీసుకున్నారా?

ఎఒ : సీడ్ మొక్కజొన్న, రబీ పంట కాలం సమయంలో యాజమాన్యం, ఆర్గనైజర్ల అధికారులను సంప్రదించకుండా అనధికారికంగా రైతులతో మాట్లాడి సీడ్ ఇస్తున్నారు. భవిష్యత్తులో పంట దిగుబడి తగ్గితే, ఆ నష్టం ఆ సీడ్ యాజమాన్యం భరించాల్సి వస్తుందని రైతులు గమనించగలరు.

ట్రావెల్స్ బస్సు తనిఖీ

ప్రజాశక్తి - చింతలపూడి

బస్సులో అత్యవసర తలుపు ఎక్కడ ఉన్నది అనేది స్పష్టంగా కనబడే విధంగా సూచికలు ఏర్పాటు చేయాలని చింతలపూడి నియోజకవర్గ ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. ఇటీవల తరచుగా జరుగుతున్న ప్రయివేట్ ట్రావెల్స్ బస్సు సర్వీసుల నేపథ్యంలో ప్రయివేటు బస్సు యాజమాన్యాలు ప్రమాదాలు జరగకుండా ప్రభుత్వం సూచించిన అన్ని ముందు జాగ్రత్త చర్యలు పాటించాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా బస్సులోని మహిళ అత్యవసర సమయంలో అద్దాలు పగల కొట్టటానికి ఇనుప రాడ్ చిన్నది తెచ్చుకోవటంతో ఎంఎల్ఎ ఆశ్చర్యం వ్యక్తంచేశారు. బస్సుకు ఉండవలసిన ఎమర్జెన్సీ డోర్ నుండి దిగడానికి ఏర్పాటు చేయాల్సిన నిచ్చెన లేకపోవడంతో ఆయన తీవ్ర అసహనాన్ని, అసంతృప్తిని వ్యక్తం చేశారు. రవాణా శాఖ అధికారులు ప్రయివేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ విషయంలో శ్రద్ధ కనబరచాలని, నిబంధనలు పాటించేలా యాజమాన్యాలకు హితబోధ చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

శీతాకాలంలో సాధారణంగా మనకు సంక్రమించే సీజనల్ వ్యాధులపై ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని, అప్పుడే వ్యాధుల బారిన పడకుండా ప్రజలు సంరక్షించుకోగలరని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు సూచించారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏలూరు పట్టణ ఆరోగ్య కేంద్రాలైన పవర్ పేట, లంబాడి పేట, జెపి కాలనీ సందర్శించి ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలతో మాట్లాడుతూ సాధారణంగా శీతాకాలంలో ప్రజలు ఎక్కువగా దగ్గు, జలుబు, ఆయాసం, ఉబ్బసం జ్వరాలు తదితర వ్యాధులతో ఇబ్బంది పడే అవకాశం ఉందని అన్నారు. కాబట్టి ముఖ్యంగా చిన్న పిల్లలు, గర్భిణులు, వయసులో పెద్దవారు చాలా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. స్వెటర్లు, మంకీ క్యాప్‌లు ధరించాలని, వీలైనంతవరకు వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని, గోరువెచ్చని నీరు తాగాలని, శీతల పానీయాలు తాగరాదని వీలైనంతవరకు చలిగాలిలో తిరగరాదని ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. అలాగే ఈనెల 21వ తేదీన జరగబోయే పల్స్ పోలియో కార్యక్రమాల్లో 0-5 సంవత్సరాల లోపు పిల్లలందరూ పోలియో చుక్కలు వేసుకునేటట్లు చూడాలని సూచించారు. దోమల నిర్మూలనలో ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గౌతమ్, డాక్టర్ ట్వింకిల్, డాక్టర్ నీలిమ, డాక్టర్ ప్రగతి, డాక్టర్ మానస, డాక్టర్ శశాంక్, హెల్త్ సూపర్‌వైజర్స్ ఝాన్సీ, హైమావతి మలేరియా హెల్త్ అసిస్టెంట్స్ మేక శ్రీనివాసరావు, మణికుమార్ పాల్గొన్నారు.

'సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం చేయాలి'

వేలేరుపాడు : అఖిలభారత 18వ సిఐటియు మహాసభను విజయవంతం చేయాలని సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. ఫ్రెండ్స్ ఆటో యూనియన్(సిఐటియు) అనుబంధ సంస్థ ఆధ్వర్యాన ప్రతి నెల రెండవ తేదీన జరిగే సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానిక ప్రజాసంఘాల కార్యాలయంలో కురిమెళ్ల శ్రీను అధ్యక్షతన నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా నాయకులు మడివి దుర్గారావు, జిల్లా కమిటీ సభ్యులు ఎస్.లత, సిఐటియు మండల నాయకులు బొగారి వెంకటేశ్వర్లు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 29 కార్మిక చట్టాలను రద్దుచేసి ఆ స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం కార్మికుల మెడకు ఉరితాడు బిగించడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వ ఆధీనంలో ఉన్నటువంటి విశాఖ స్టీల్ ప్లాంట్‌ను 32 భాగాలుగా విభజించి వివిధ ప్రయివేటు సంస్థలకు కేంద్ర ప్రభుత్వం కట్టపెట్టే కుట్రను విరమించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ ప్రయివేటు రంగాలలో పనిచేస్తున్న కార్మికులకు క్లిష్ట పరిస్థితులలో ఎటువంటి ఇబ్బందులు వచ్చినా సిఐటియు యూనియన్ ఎప్పుడూ వెన్ను దన్నుగా ఉండి కార్మికుల సమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడుతూనే ఉంటుందన్నారు. ఈనెల 31 నుంచి జనవరి 4 వరకు సిఐటియు అఖిల భారత పద్దెనిమిదవ మహాసభలు జరుగుతున్నాయని, కార్మికులందరూ చేయి చేయి కలిపి మహాసభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఆటో యూనియన్ సభ్యులు కమ్మిచిచ్చు రమేష్, బీరం అంజి, మజ్జి శ్రీను, బల్లా మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

మండల పరిధిలోని పలు శంకుస్థాపనలు, అభివృద్ధి కార్యక్రమాల్లో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు మంగళవారం పాల్గొన్నారు. గంగవరం గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు సుమారు రూ.38 లక్షల 60 వేల వ్యయంతో నిర్మించనున్న నూతన పాఠశాల భవనానికి ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం కొయ్యలగూడెం నుండి కన్నాపురం వరకు సుమారు రూ.3 కోట్ల 70 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన రోడ్డుకు శంకుస్థాపన చేశారు. కొయ్యలగూడెం జెడ్‌పిహెచ్ఎస్ ప్రాథమిక పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు విద్యానికేతన్ పుస్తకాలను పంపిణీ చేశారు. అనంతరం విద్యార్థులను ప్రోత్సహించి మాట్లాడుతూ విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. అనంతరం కొయ్యలగూడెం ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యాన నిర్వహించిన రైతన్నా మీకోసం' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన, కూటమి ప్రభుత్వం రైతులకు అందిస్తున్న మద్దతు, పథకాల వివరాలను రైతులకు తెలియజేశారు. తదనంతరం సచివాలయం వద్ద నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఎంఎల్ఎ పాల్గొనగా మొత్తం దాదాపు 140 ఫిర్యాదులు అందాయి. అందులో సుమారు 40 వరకు పింఛన్‌కు సంబంధించిన ఫిర్యాదులుండగా, కొన్ని ఫిర్యాదులు రెండు నుంచి మూడుసార్లు చేసినప్పటికీ పరిష్కారం కావటం లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. కార్యక్రమంలో జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి కరాటం సాయి, కార్యదర్శి గడ్డమనుగు రవికుమార్, ట్రైకర్ ఛైర్మన్ బొరగం శ్రీనివాస్, జనసేన మండల అధ్యక్షుడు తోట రవి, టిడిపి మండల అధ్యక్షుడు పారేపల్లి రామారావు, సొసైటీ అధ్యక్షుడు దుగ్గిన శ్రీనివాస్, టౌన్ అధ్యక్షుడు మాదేపల్లి శ్రీనివాస్, జిల్లా సంయుక్త కార్యదర్శి మద్దు తేజ, కోనా కుమార్, మేకల తేజ పాల్గొన్నారు.



ప్రజావాణిలో మాట్లాడుతున్న ఎంఎల్ఎ

పిటిఎం-3.0 విజయవంతం చేయాలి

ఎంఇఒ-1 ఇ.శ్రీనివాసరావు



ఆన్‌లైన్ నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ

ప్రజాశక్తి - భీమడోలు

విద్యార్థుల ఉన్నత భవిష్యత్తుకు ప్రభుత్వం రూపొందించిన పిటిఎం-3.0 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని భీమడోలు మండల విద్యాశాఖాధికారి-1 ఇ.శ్రీనివాసరావు కోరారు. మండలంలో విద్యార్థుల తెలుగు, లెక్కలు, ఇంగ్లీషు సబ్జెక్టుల కనీస సామర్థ్యాలను పరిశీలించేందుకు ఆన్‌లైన్ కార్యక్రమం ఆయా పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయుల సహకారంతో కొనసాగుతోంది. దీనిలో భాగంగా మంగళవారం మండల విద్యాధికారి భీమడోలు ఎంపీపీ ప్రాథమిక పాఠశాల-3 పాఠశాలను సందర్శించారు. సిపిఎంటి సత్య ప్రసాద్, సహకారంతో ఆన్‌లైన్ విధానంలో విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. వివరాలను నమోదు చేశారు. ఈ ప్రక్రియ విద్యార్థుల సామర్థ్యాల్లోని అసమానతలను గుర్తించి సరిచేసేందుకు సహకరిస్తుందన్నారు. మెగా పిటిఎం కార్యక్రమం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల మధ్య, విద్యార్థుల భవిష్యత్తు విషయమై అవగాహన కల్పించడంతో పాటు వారు పరస్పరం సహకరించేందుకు దోహదపడుతుందన్నారు. దీని ఆధారంగా విద్యార్థులు తమ ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల సహకారంతో మరింత ఉన్నతంగా విద్యను నేర్చుకోవచ్చునన్నారు. మండల స్థాయిలో ఈనెల 7వ తేదీన నిర్వహించే ఎన్ఎంఎంఎస్ అర్హత పరీక్షలకు మండల వ్యాప్తంగా 82 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారన్నారు. వీరికి హాల్ టికెట్లు అందజేసే విషయమే నిబంధన మేరకు ఉపాధ్యాయులు సహకరిస్తున్నారని తెలిపారు. దీనిలో భాగంగా భీమడోలు హై స్కూల్ నుంచి అత్యధికంగా 31 మంది, ఎంఎం.పురం హై స్కూల్ నుంచి 9 మంది హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేశామని తెలియజేశారు.

సచివాలయాల సందర్శన

ప్రజాశక్తి - ఉంగుటూరు

గ్రామాలాభివృద్ధికి సంబంధించిన అంశాలపై ప్రజా ప్రతినిధుల అభిప్రాయాలు, విజ్ఞాపనలు, వినతులు స్వీకరించేందుకు ఎంఎల్ఎ ధర్మరాజు మంగళవారం మండలంలోని గ్రామాల్లో సచివాలయాలను సందర్శించారు. మండలంలోని పలు గ్రామాల్లో ప్రజా సమస్యలను సమగ్రంగా తెలుసుకోవడం, గ్రామాల అభివృద్ధికి వేగం చేకూర్చడం లక్ష్యంగా ఈ పర్యటన చేసినట్లు ఎంఎల్ఎ పేర్కొన్నారు. చేబ్రోలు, గోపినాధపట్నం, గొల్లగూడెం, గోపాలపురం, నల్లమాడు, రామచంద్రపురం, యర్రమిల్లిపాడు గ్రామాల్లో సచివాలయాల వద్ద ప్రజాప్రతినిధులు, గ్రామ కూటమి నేతలు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. గ్రామాల అభివృద్ధి అవసరాలు, ప్రాధాన్య సమస్యలు, చేపట్టవలసిన పనులపై విస్తృతంగా చర్చించి, ప్రతి పంచాయతీ వారీగా అభివృద్ధి వివరాలను నివేదిక రూపంలో సేకరించారు. ప్రత్యేకంగా చేబ్రోలు సమావేశంలో రాబోయే రైల్వే ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి సంబంధించిన ప్రణాళికపై సమగ్ర చర్చ జరిగింది. గ్రామంలో ప్రధాన డ్రెయినేజీ వ్యవస్థ అభివృద్ధి, పలు సీసీ రోడ్లు, నూతన పైప్‌లైన్ నిర్మాణం, నారాయణపురం నుండి చేబ్రోలు పోలీస్ స్టేషన్ వరకు సర్వీస్ రోడ్ ఏర్పాటు, పుంత రోడ్డులో ఉన్న ఆక్రమణలను తొలగించి కొత్త రోడ్డు నిర్మించాలన్న ప్రజా ప్రతినిధుల అభ్యర్థనలను ఎంఎల్ఎ పరిశీలించారు. అనంతరం మిగతా గ్రామాల్లో చెరువుల పునరుద్ధరణ, సీసీ, పుంత రోడ్ల నిర్మాణం, రక్షిత మంచినీటి ట్యాంకులు, డ్రెయినేజీ పనులు, శ్మశానవాటికల అభివృద్ధి వంటి అంశాలను ప్రజాప్రతినిధులు ప్రస్తావించగా, అన్ని సమస్యలపైనా అధికారులు తక్షణం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని ఎంఎల్ఎ ఆదేశాలు జారీ చేశారు. అలాగే నిర్మాణం సగంలో నిలిచిపోయిన ఆర్ఎస్‌కె సచివాలయం, వెల్‌నెస్ సెంటర్, అంగన్వాడీ, పాఠశాల భవనాల వివరాలను పూర్తి నివేదికగా సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అనంతరం ఎంఎల్ఎ ధర్మరాజు మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో మౌలిక వసతులను బలోపేతం చేస్తూ అభివృద్ధి కార్యక్రమాలను మరింత వేగంగా ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామన్నారు. గ్రామాల్లో ప్రజలు, నాయకులతో నేరుగా సమావేశమై తెలుసుకున్న సమస్యల ఆధారంగా అభివృద్ధి ప్రతిపాదనలను సిద్ధం చేసి, వాటిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సమర్పించనున్నట్టు తెలిపారు. పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, ఉంగుటూరు ఎంపిడిఒ రాజ్‌మనోజ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.


ఫారెస్ట్ భూమి ఆక్రమిస్తే కఠిన చర్యలు

ప్రజలు సామరస్యంగా ఉండాలి

మంత్రి కొలుసు పార్థసారధి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని దేవరగుంట-జంగంగూడెం గ్రామాల మధ్య గత కొంతకాలంగా జరుగుతున్న ఘర్షణ గొడవలు ఎట్టకేలకు సామరస్యంగా ముగిసింది. గత కొంతకాలంగా ఇరు గ్రామాల ప్రజలు ఫారెస్ట్ భూమి కోసం ఘర్షణలు పడుతున్న సంగతి తెలుసుకొని రాష్ట్ర గృహనిర్మాణ సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారధి అధికారులతో కలిసి ఇరు గ్రామాల ప్రజలను, సాగు రైతులను పిలిపించి ఇరు పక్షాలతో మాట్లాడి పట్టాల వివరాలు, సాగు రైతుల వివరాలు క్షుణ్ణంగా పరిశీలించారు. సాధ్యసాధ్యాల బట్టి అధికారులను బోర్డర్లు కేటాయించి ఎవరిది వారికి బౌండరీలు కేటాయించాలని అధికారులకు హెచ్చరించారు. సుమారు 100 మంది సాగు రైతులకు గాను సుమారు 70 సెంట్ల భూమి పట్టాలు ఇచ్చారని తెలుసుకున్న మంత్రి పట్టాల్లో ఉన్న భూమి తప్ప ఒక్క సెంటు కూడా ముందుకు ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిగిలిన ఫారెస్ట్ భూమిని పశుగ్రాసానికి కేటాయించి సరిహద్దులు నియమించాలని అధికారులకు హెచ్చరించారు. సబ్ డివిజన్లు చేయలేదనే ఒంకతో ఆక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఇరు గ్రామాల సాగు రైతులు కేటాయించిన సరిహద్దు దాటి ముందుకు వస్తే కఠిన చర్యలు తప్పవని, పట్టాలు కూడా రద్దు చేస్తామని హెచ్చరించారు. ఇరువురూ కలిసి సామరస్యంగా భూమి సాగుచేసుకుంటే మంచిదని సూచించారు. డి పట్టా ఉన్నవారు సాగు చేసుకోవచ్చని అన్నారు. చట్టాన్ని వ్యతిరేకించి చట్ట విరుద్ధంగా నడుచుకుంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. మోటర్లు కట్ చేసిన వారిని, చెట్లు నరికిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదన్నారు. విధ్వంసాలను ప్రోత్సహించే వారిని ఉపేక్షించేది లేదని, గొడవలు రెచ్చగొట్టే వారు ఎలాంటి వారైనా ఉపేక్షించేది లేదని, చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. సుమారు 200 మంది సాగు రైతులకు పట్టాలు ఇవ్వవలసి ఉందని రైతులు కోరగా సుమారు 82 సాగు రైతులకు పట్టాలు ఇప్పటికే ఇచ్చినట్లు అధికారులు తెలియజేశారు. మిగిలి గయ్యాల భూమిని సిసిఎల్ఎలో పెండింగులో ఉన్నాయని అధికారులు తెలియజేయగా ప్రభుత్వం ఉత్తర్వుల మేరకు మిగిలిన రైతులకు పట్టాలు అందించే ప్రయత్నం చేస్తామని సబ్ కలెక్టర్ తెలిపారు. అనంతరం ఇరు గ్రామాల ప్రజలు మంత్రికి కృతజ్ఞత తెలిపారు. కార్యక్రమంలో సబ్ కలెక్టర్ బి.వినూత్న, జిల్లా ఫారెస్ట్ అధికారి, పోలీసు అధికారులు, తహశీల్దార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి పార్థసారధి

నేడు మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - ముదినేపల్లి

ముదినేపల్లి మండల ప్రజాపరిషత్ సర్వసభ్య సమావేశం బుధవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎంపిపి రామిశెట్టి సత్యనారాయణ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశపు హాలులో జరగనుందని ఎంపిడిఒ వై.రామకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, కార్యదర్శులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

అక్కిన శేషు, వేములపల్లి సుధీర్‌లకు అభినందన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నల్లమాడులో సిఎం పర్యటన పురస్కరించుకుని గత కొన్ని రోజులుగా ఏర్పాట్లలో కీలకపాత్ర పోషించిన టిడిపి మండల అధ్యక్షులు వేములపల్లి సుధీర్, టిడిపి నాయకుడు, గుత్తేదారుడు అక్కిన శేషులను ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అభినందించారు. నల్లమాడులో సోమవారం పార్టీ క్యాడర్ సమావేశం అనంతరం ఆయన పార్టీ నాయకులతో సిఎం ఫొటోలు దిగారు. సిఎం పర్యటన, పబ్లిక్ మీటింగ్, హెలిప్యాడ్ నిర్మాణ పనులు, వేదిక, జన సమీకరణలో కీలక పాత్ర పోషించిన శేషు, సుధీర్ సేవలను టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు సిఎం దృష్టికి తీసుకెళ్లారు. వారిద్దరిని పార్టీకి మరింత సేవలు అందించాలని కోరారు.

టార్పాలిన్ బరకాలు పంపిణీ

ప్రజాశక్తి - పోలవరం

మండలంలోని ఆరు ధాన్యం కొనుగోలు కేంద్రాలకు రైతులకు ఉపయోగపడే టార్పాలిన్ బరకాలను ఉచితంగా పంపిణీ చేశారు. మొత్తం 120 టార్పాలిన్లు రైతులకు అందజేశారు. ధాన్యం తడవకుండా, పాడవకుండా ఉండేందుకు రాశులపై తప్పనిసరిగా ఈ బరకాలను కప్పుకోవాలని వ్యవసాయాధికారి కె.రాంబాబు రైతులకు సూచించారు. ధాన్యం అమ్మిన తర్వాత సొసైటీ నుండి తీసుకున్న బరకాలను తిరిగి జమ చేయాల్సిందిగా రైతులకు తెలియజేశారు. పాత పట్టిసీమ సొసైటీలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రెసిడెంట్ నునకాని రాంబాబు, మండల వ్యవసాయ అధికారి కె.రాంబాబు, ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకుల నియామకానికి దరఖాస్తులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి ప్రభుత్వ డిగ్రీ కళాశాల బోటని విభాగంలో బోధించుటకు గాను అతిథి అధ్యాపకుల నియామకం జరుగుతుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ పి.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పీజీలో సంబంధిత సబ్జెక్టులో ఒసి, బిసి వారికి 55 శాతం, ఎస్‌సి, ఎస్‌టి అభ్యర్థులకు 50 శాతం మార్కులు కలిగి, అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 12వ తేదీ లోపల దరఖాస్తు చేసుకోగలరని తెలియజేశారు. ఈనెల 12వ తేదీన ఇంటర్వ్యూ నిర్వహించబడుతుందని, నెట్, పిహెచ్‌డి అర్హత కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని పేర్కొన్నారు. gdcchintalapudi.jkc@gmail ద్వారా సంప్రదించబడునని తెలియజేశారు.

అడ్మిషన్ ఫీజు చెల్లింపునకు 6 వరకూ అవకాశం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్


ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యా పీఠం(ఓపెన్ స్కూల్) ద్వారా 2025-26 విద్యా సంవత్సరంలో పదవతరగతి, ఇంటర్మీడియట్ ప్రవేశాలకు తత్కాల్‌లో అడ్మిషన్ ఫీజు చెల్లించుటకు, రూ.600 అదనపు రుసుముతో ఈనెల 2వ తేదీ నుంచి 6వ తేదీ వరకు మరొక అవకాశం కల్పించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకట లక్ష్మమ్మ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. గతంలో రెగ్యులర్ పదవతరగతి ఓల్డ్ సిలబస్ రాసి ఫెయిల్ అయిన అభ్యాసకులకు ఓపెన్ స్కూల్ ద్వారా అడ్మిషన్ పొందుటకు కూడా ప్రత్యేక అవకాశముందని, అడ్మిషన్ ఫీజు, పరీక్ష ఫీజు చెల్లించి అడ్మిషన్ పొందవచ్చని, జిల్లాలో మండల విద్యాశాఖాధికారులు, హెచ్ఎం, ఎఐ కోఆర్డినేటర్లు సంబంధిత అభ్యాసకులకు తెలియజేసి అడ్మిషన్ చేయుటకు తగు చర్యలు తీసుకోవలసిందిగా కోరారు.

మానసిక సమస్యలపై అవగాహన

ప్రజాశక్తి - పెదపాడు

పిల్లల్లో ఎదురయ్యే మానసిక సమస్యలపై నోడల్ ఆఫీసర్ డాక్టర్ కోమలి అవగాహన కల్పించారు. జాతీయ మానసిక ఆరోగ్య దినోత్సవం మంగళవారం గురుకుల పాఠశాల వట్లూరులో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కోమలి మాట్లాడుతూ విద్యార్థుల్లో పరీక్షల వల్ల ఎదురయ్యే ఆందోళన, భయం, ఒత్తిడి వంటి సమస్యలు ఎలా ఎదుర్కోవాలి అనే వాటిపై అవగాహన కల్పించారు. 14416 హెల్ప్‌లైన్ గురించి సమాచారం ఇచ్చారు. విద్యార్థులకు ఒత్తిడి సమయంలో చేయవలసిన రిలాక్సేషన్ టెక్నిక్స్, మెడిటేషన్ వంటి సూచనలు సలహాలు అందించారు. అనంతరం విద్యార్థులతో ముఖాముఖీగా వారి మానసిక సమస్యలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ డాక్టర్ మేరీ జాన్సీరాణి మాట్లాడుతూ పిల్లలకు శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఆరోగ్యం ఎంత అవసరమో వివరించారు. ఈ కార్యక్రమంలో సోషల్ వర్కర్ తిరుపతి స్వామి, వట్లూరు పిహెచ్‌సి ఎఎన్ఎం సుబ్రహ్మణ్యేశ్వరి, ఆశ వర్కర్ నాగ లక్ష్మి, ఇతర పాఠశాల సిబంది పాల్గొన్నారు.

మాజీ సర్పంచి సత్యనారాయణ మృతి



ప్రజాశక్తి - ఉంగుటూరు

తిమ్మాయపాలెం పంచాయతీ మాజీ సర్పంచి మారిశెట్టి సత్య నారాయణ(62) మంగళవారం గుండెపోటుతో మరణించారు. ఆయన 2001 - 2006 మధ్యకాలంలో ఆ గ్రామానికి సర్పంచిగా సేవలందించారు. ఎంఎల్ఎ ధర్మరాజు, టిడిపి నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.